ప్రజాశక్తి

శనివారం 4 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆగని తీరం కోత

- అడ్డుకట్టకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్టు ప్రభుత్వ లెక్కలు
- సిఆర్‌జెడ్ ఉల్లంఘన కట్టడాలపై కానరాని చర్యలు
- పోర్టు, బీచ్ పరిసరాల్లోని మడ అడవులు మాయం



కోతకు గురైన విశాఖ తీరం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ సాగర తీరం నానాటికీ కోతకు గురవుతోంది. కోతను ఆపే దిశగా రూ.కోట్లు వెచ్చిస్తున్నట్టు లెక్కలు చెబుతున్నా శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యంగా సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన కట్టడాలపై కనీస చర్యలు కరువయ్యాయి. వెరసి తీరానికి ముప్పు పెరుగుతోంది.

2021 నాటికి విశాఖ పోర్టు ట్రస్ట్ (విపిటి), డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) రూ.వంద కోట్ల సాయంతో కోతను ఆపేదిశగా ఖర్చు చేశాయి. అంతకు ఏడేళ్ల క్రితం విశాఖపట్నం సాగర తీర అభివృద్ధి పేరుతో ప్రపంచ బ్యాంకు జివిఎంసికి రూ.390 కోట్లు మంజూరు చేసింది. కొన్ని పనులు చేపట్టారు. తాజాగా తీర ప్రాంత కోత నివారణకు రూ.222 కోట్ల నిధులను అర్బన్ ఫ్లడ్ మిటిగేషన్ ప్రోగ్రామ్ ఫేజ్ – 2 కింద ఖర్చుచేసేందుకు నేషనల్ డిజాస్టర్ మేనేజిమెంట్ అథారిటీ (ఎన్‌డిఎంఎ) ఆమోదించినట్లు విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ ప్రకటించారు. దీంతో మళ్లీ తీరం విషయం చర్చనీయాంశంగా మారింది. తాజా నిధుల్లో 90 శాతం అంటే రూ.200 కోట్లు కేంద్రం నుంచి, 10 శాతం రూ.22.22 కోట్లు రాష్ట్రం నుంచి రాబోతున్నాయనేది ఎంపీ ప్రకటన సారాంశం.

సిఆర్‌జెడ్ నిబంధనలు ఏం చెబుతున్నాయి ? విశాఖలో ఏం జరుగుతోంది ?

సాగర తీరానికి వెయ్యి మీటర్ల దూరం వరకూ భవనాల నిర్మాణం ఉండరాదు. దీన్ని 500 మీటర్లకు మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. అక్రమ కట్టడాలతో విశాఖ తీర ప్రాంతం నిత్యం కోతకు మిగతా 2లో..

నిధుల ఖర్చుతో సరేనా ?

ఇంతవరకూ సాగర తీరం కోత నివారణ కోసం చేసిన ఖర్చుతో ఏమైనా ఫలితం వచ్చిందా ?. కేవలం నిధులు ఖర్చుచేస్తే కోత నియంత్రణ ఆగుతుందా ?. సిఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ తీరంలో జరిగే కట్టడాలపై ఏం చర్యలు తీసుకున్నారు ? వీటన్నిటిపైనా చర్చ జరగాలి. ప్రభుత్వాలు నిధులు ఖర్చుచేసే ముందు ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని శాస్త్రీయ పరిష్కారం కనుగొనాలి.

– ఇఎఎస్.శర్మ, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి



ఈదురు గాలులకు వేళ్లతో సహా కూలిన చెట్టు

వాయు విలయం

విశాఖలో కూలిన వందలాది చెట్లు, విద్యుత్ స్తంభాలు
కంచరపాలెంలో ఒకరు మృతి

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో గురువారం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. కాలనీల్లోని వందలాది చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఎంవిపి.కాలనీ, మద్దిలపాలెం, హెచ్‌బి.కాలనీ వంటిచోట్ల వాయు విలయమే నెలకొంది. ఈదురుగాలులకు 80 ప్రాంతాల్లో చెట్లు పాక్షికంగా, 150 ప్రాంతాల్లో పూర్తిగా నేలకూలాయని జివిఎంసి అధికారులు ప్రకటించారు. వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూశారు.

కంచరపాలెం మెట్టు ముత్యమాంబ గుడి ఎదురుగా ఉన్న టీ షాపు వద్ద విద్యుత్ తీగలు తెగి టీ షాప్ నడుపుతున్న బత్తిని ఈశ్వరరావు (52)పై పడ్డాయి. దీంతో అతను తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఇదే ఘటనలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడు అరెస్ట్

వార్త 2లో..

అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దు

వార్త 2లో..

పిహెచ్‌సి వైద్యుల డిమాండ్లను నెరవేర్చాలి

వార్త 8లో..



రాష్ట్ర స్థాయి అవార్డు దక్కించుకున్న చౌడువాడలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో అవార్డుల పంట

రాష్ట్ర స్థాయిలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు కీర్తి

వార్త 5లో..

పకడ్బందీగా మహిళా ప్రపంచ కప్ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ

ఈ నెల 9 నుంచి విశాఖ వేదికగా జరగనున్న ఐసిసి మహిళా ప్రపంచ కప్ – 2025 మ్యాచ్‌లకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. మ్యాచ్‌లకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం విశాఖలోని ఎసిఎ – విడిసిఎ మైదానంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాచ్‌ల సమయంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని, బలమైన బ్యాక్‌అప్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. జట్లు ప్రయాణించే మార్గాల్లోనూ, ఇతర ముఖ్య ప్రాంతాల్లోనూ సుందరీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ఈ మ్యాచ్‌లకు వివిధ విభాగాల్లో టికెట్లను విక్రయించనున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ మ్యాచ్‌లు అయినందున టికెట్ బాక్స్ ఆఫీసుల వద్ద భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు పార్కింగ్ ప్రాంతాల్లోనూ క్యూఆర్ కోడ్స్‌ను ప్రవేశపెట్టామన్నారు. పలుచోట్ల సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గిరీష్ డోంగ్రే మాట్లాడుతూ విశాఖ వేదికగా ఈ నెల 12న జరగనున్న ఇండియా – ఆస్ట్రేలియా మ్యాచ్‌కు ఐసిసి, బిసిసిఐ అధికారులు హాజరవుతారని తెలిపారు. ప్రత్యేక అత్యవసర వైద్య సదుపాయం కోసం అపోలో హాస్పిటల్స్ మూడు అంబులెన్స్‌లను అందించ నున్నాయన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచామని, బి గ్రౌండ్, వి కన్వెన్షన్‌లలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని చెప్పారు. బుక్ మై షో ద్వారా టికెట్లు అందుబాటులో ఉన్నాయని భారత్ ఆస్ట్రేలియా మ్యాచ్‌కు రూ.150, మిగిలిన మ్యాచ్‌లకు రూ.100 ధర నిర్ణయించామని, గేట్ 17 వద్ద ఉన్న ఐదు కౌంటర్ల ద్వారా టికెట్ల అమ్మకాలు నిర్వహిస్తామని చెప్పారు. ఆఫ్‌లైన్ టికెట్ల అమ్మకాల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

విశాఖ వేదికగా ఈ నెల 9, 12, 13, 16, 26 తేదీలలో ఐదు ప్రపంచ కప్ మ్యాచ్‌లు జరుగనున్నాయన్నారు. సమీక్షా సమావేశంలో జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులు విష్ణు దంటు, డిసిపి (లా అండ్ ఆర్డర్) – 2 మేరీ ప్రశాంతి పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఆగని తీరం కోత

గురౌతూనే ఉంది. దీనికోసం బీచ్ నౌరిష్‌మెంట్ పేరుతో డిసిఐ, విశాఖ పోర్టు ఏటా తీరంలోకి ఇసుకను ఒడ్డు నుంచి పైపుల ద్వారా పంపుతున్నాయి. ఇసుకను తీరానికి దగ్గరగా ఒడ్డు నుంచి లోపల వేయడంతో ప్రవాహం వేగం తగ్గనుంది. అయితే, తీరానికి దగ్గరగా, నిబంధనలను ఉల్లంఘిస్తూ కట్టడాలు అధికం కావడంతో సాగరంలోంచి వచ్చే అలల తాకిడికి తీరం కొట్టుకుపోతూనే ఉంటోంది. మరోవైపు విశాఖ, గంగవరం పోర్టు పరిసరాల్లో నౌకలు సులువుగా వచ్చేందుకంటూ లోతుగా డ్రెడ్జింగ్ చేస్తున్న కారణంగానూ తీరం కోతకు గురవుతున్నట్లు స్పష్టమవుతోంది. పోర్టు ఏరియా నుంచి శీలానగర్ వరకూ రోడ్ల విస్తరణ జరుగుతున్న దశలో ఇరువైపులా ఉండే మడ అడవులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే విశాఖ తీరంలోని మడ అడవులను తొలగిస్తూ కట్టడాలు ఎప్పటినుంచో సాగిపోతున్నాయి. ప్రస్తుతం ఆర్‌కె బీచ్ పరిసరాల్లోని నోవోటల్ సముదాయం సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి కట్టినదే. రుషికొండ ఏరియాలో ఉండే సాయిప్రియ, ఎ1 గ్రాండ్, రాడిషన్ బ్లూ వంటి భారీ హోటళ్లూ ఈ కోవలోకే వస్తాయి. వాటి నిర్మాణాలతో తీరానికి ముప్పు వాటిల్లుతోంది. త్వరలో లూలూ మాల్ కూడా రాబోతుంది. దీంతో మరింత నష్టం జరుగనుంది. ఈ విషయాలను విస్మరించి.. సాగర తీరం కోత పేరుతో రూ.కోట్లు ఖర్చు చేస్తే కాంట్రాక్టర్లకు జేబులు నిండుతాయి మినహా లాభం ఏమిటన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి.



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1690వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు ప్రశ్నించగా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామి లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం జరుగుతుందని పేర్కొంటూ అందుకుగల కారణాలను తెలియజేశారన్నారు. కేంద్రం అంత స్పష్టంగా చెబుతున్నా ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని కూటమి నాయకులు చెప్పడం ప్రజలను మోసపుచ్చడమే అవుతుందన్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం నిలుపుదల చేసి, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.నర్సింగరావు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

అరకు కాఫీకి అవార్డుపై చంద్రబాబు అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అరకు కాఫీ ద్వారా జాతీయ స్థాయిలో బిజినెస్ లైన్ ఛేంజ్ మేకర్ అవార్డు దక్కించుకున్న గిరిజన సహకార సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. అరకు వ్యాలీ కాఫీకి ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో అవార్డు దక్కడంపై గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జిసిసి ఎండి కల్పనాకుమారిని ముఖ్యమంత్రి ప్రశంసించారు. శనివారం చంద్రబాబును మంత్రి సంధ్యారాణి, ఎండి కల్పనాకుమారి సచివాలయంలో కలిశారు. బిజినెస్ లైన్ నుంచి స్వీకరించిన అవార్డును, ప్రశంసా పత్రాన్ని సిఎం పరిశీలించారు. జిఐ ట్యాగ్ పొందిన తర్వాత అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ బ్రాండ్‌గా మారిందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రీయ విధానంలో సాగు అవుతున్న అరకు కాఫీ స్వచ్ఛత, సువాసనలతో పాటు ప్రత్యేక రుచిని కలిగి ఉంద న్నారు. ఈ విశిష్టత కారణంగా అరకుకాఫీ మంచి బ్రాండ్ అనే పేరు వచ్చిందని సిఎం చెప్పారు. ఇటీవల జీసీసీ-టాటా కన్స్యూమర్ ప్రొడెక్ట్స్ లిమిటెడ్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో దేశంలో తొలిసారిగా ఆర్గానిక్ సాల్యూబుల్ కాఫీ ఉత్పత్తి కానుందని మంత్రి సంధ్యారాణి సిఎంకు వివరించారు. నర్సీపట్నం సమీపంలోని మాకవరపాలెంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తిగా బీన్ టు కప్ మోడల్ అభివృద్ధి కానుందని తద్వారా అరకు కాఫీకి మరింత మార్కెట్ వస్తుందని మంత్రి సంధ్యారాణి వివరించారు.



చంద్రబాబుతో సంధ్యారాణి, కల్పనాకుమారి

అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దు

వార్వా, నివాస్ డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే అదాని సిమెంట్ ఫ్యాక్టరీని పెదగంట్యాడ ప్రాంతంలో ఏర్పాటు చేయొద్దని వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ కోసం ఈ నెల 8న నిర్వహించ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎపిపిసిబి చైర్మన్‌కు వారు లేఖ రాశారు. ఆ వివరాలను మీడియాకు తెలిపారు. ఈ ఫ్యాక్టరీ కోసం రూపొందించిన ఇఎఐ అధ్యయన నివేదిక లోపభూయిష్టంగా ఉందని పేర్కొన్నారు. పెదగంట్యాడలో ప్రజలు నివసించే ఇళ్లు, అపార్టుమెంట్లు ఫ్యాక్టరీకి ప్రతిపాదించిన స్థలం పక్కనే ఉన్నాయని, కనీసం అర కిలోమీటరు దూరం కూడా లేవని తెలిపారు. ఫ్యాక్టరీ కాలుష్య కారకాలు సమీపంలో నివసించే ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని పేర్కొన్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుతో నీటి సమస్య తలెత్తనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఇఎఐ అధ్యయనాన్ని సిద్ధం చేసిన కన్సల్టింగ్ సంస్థ వీటన్నింటినీ విస్మరించిందని విమర్శించారు. అదానికి చెందిన గంగవరం పోర్టు ఇప్పటికే ఘోరమైన కాలుష్యాన్ని వెదజల్లుతోందని తెలిపారు. పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తూనే వుందన్నారు. ఈ పరిణామాలు అదానీ కంపెనీ తాలూకా నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవే సిమెంట్ ఫ్యాక్టరీ విషయంలోనూ పునరావృతం కానున్నాయన్నారు.

పోర్టులో కార్మికుల తొలగింపులు ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టులోని జెపి అఫ్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న కార్మికులను అక్రమంగా తొలగించే చర్యలను నిలుపుదల చేయాలని విశాఖపట్నం పోర్టు కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బి.జగన్. డిమాండ్ చేశారు. శుక్రవారం పోర్టు ఎఓబి ఎదుట నిరసన తెలిపారు. పోర్టు చైర్మన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పోర్టు జెపి అఫ్ సోర్స్ సంస్థ యాజమాన్యం అకస్మాత్తుగా ఎటువంటి ముందస్తు నోటీసూ లేకుండా, తగిన విధానాన్ని అనుసరించకుండా కార్మికులను పని నుండి తొలగించడానికి ప్రయత్నించిందని చెప్పారు. కార్మికులు తమ హాజరు నమోదు చేసుకున్న తర్వాత కూడా ఏకపక్ష చర్యకు దిగి వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కనీస వేతనాలను యాజమాన్యం చెల్లించటం లేదని రికార్డుల పరంగా రుజువైందన్నారు. కార్మికులు ఆదివారాలు, సెలవు దినాలలో సహా ప్రతి షిఫ్ట్‌కు 12 గంటలు పని చేయవలసి వచ్చిందన్నారు. అదనపు పని గంటలకు అదనపు చెల్లింపు లేకుండా యాజమాన్యం వ్యవహరించేదని, దీనిపై పలుమార్లు యూనియన్ పరంగా తాము ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. దీంతో తాము విశాఖపట్నంలోని ప్రాంతీయ కార్మిక కమిషనర్ ముందు క్లైమ్ దాఖలు చేయవలసి వచ్చిందన్నారు. ఆరు నెలలు కావస్తున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అనివార్య పరిస్థితిలో తాము జెపి కంపెనీకి సమ్మె నోటీసు ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఇది ప్రస్తుతం విజయవాడలోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ముందు రాజీలో ఉందన్నారు. రెండు రాజీ సమావేశాలు జరిగాయని, కానీ యాజమాన్యం హాజరు కాలేదని అన్నారు. ఆశ్చర్యకరంగా రాజీ ప్రక్రియలో పాల్గొనడానికి బదులుగా యాజమాన్యం ఇప్పుడు ఎటువంటి సమాచారమూ లేకుండా కార్మికులను చట్ట విరుద్ధంగా విధుల నుండి ఆపడానికి ప్రయత్నించిందన్నారు. వారికి రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. ముఖ్యంగా ఈ పండుగ సీజన్‌లో వేతనాలు అందక కార్మికులు ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడ్డారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పోర్టు చైర్మన్ ప్రిన్సిపల్ ఎంప్లాయిర్‌గా జోక్యం చేసుకొని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెఎం.కుమార మంగళం, శ్రీను,తాతలు, అప్పలరాజు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పోర్టు కార్మికులు

గాంధీ బాటలో నడవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జాతిపిత మహాత్మాగాంధీ బాటలోనే నేటి తరం నడవాలని, వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆశ్రఫ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యదర్శి ఎం.ఎల్లాజీ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ దేశంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. వాటన్నింటినీ సామరస్యంగా పరిష్కరించాలంటే, అందరూ గాంధీ ఆలోచనతో ఉండాలని, తమ అసోసియేషన్ ఆ విధంగానే పనిచేస్తుందని తెలిపారు. ప్రతినెలా సమాజ హితం కోరే షార్ట్‌ఫిలిమ్స్ నిర్మించడమే కాకుండా అనేకమంది కళాకారులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రతి నెలా షార్ట్‌ఫిలిం నిర్మాణంలో భాగంగా అక్టోబర్‌లో నిర్వహించే షార్ట్ ఫిలిం డ్రగ్స్ నిర్మూలనపై ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు హీరో కుమార్‌రాజ్, సంతోష్,ఉమా మహేష్, వై.అప్పారావు, ఇమ్మంది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడు అరెస్ట్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో వరుస చోరీలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠా బవేరియా గ్యాంగు సభ్యుడిని నగర పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని విశాఖపట్నం క్రైమ్ డిసిపి లతామాధురి తెలిపారు. శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన ఏడు చైన్‌స్నాచింగ్‌లు రెండు బైకు దొంగతనాల కేసుల విచారణలో భాగంగా కంచరపాలెం క్రైమ్ విభాగం పోలీసులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం , అల్లావుద్దీన్పూర్ గ్రామానికి చెందిన ధర్మేంద్రకుమార్ (34) అనే అంతర్రాష్ట్ర ముఠాసభ్యుడిని అరెస్టు చేసి విచారించగా విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తొమ్మిది కేసులతో పాటు ఇతర రాష్ట్రాలైన జమ్మూ కాశ్మీర్లో తొమ్మిది , ఢిల్లీలో ఒకటి, ఉత్తరప్రదేశ్‌లో 11, ఒడిస్సాలో మూడు కేసులతో కలుపుకొని మొత్తం 33 కేసులు అతనిపై ఉన్నాయని ఆరోతరగతి వరకూ చదువుకున్న నిందితుడు ధర్మేంద్రకుమార్ చోరీలు చేయడంలో దిట్ట అని తెలిపారు. ఇతని గ్యాంగ్‌కు సంబంధించి సూరజ్ , కపిల్, హజారేసింగ్‌లను ఇంకా పట్టుకోవాల్సి ఉందని దేశవ్యాప్తంగా అత్యంత ప్రమాదకరమైన బవేరియా గ్యాంగ్ సభ్యుడిగా ఇతనిని గుర్తించారు. ఇతనిపై విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు, శీలా నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చైన్ స్నాచింగ్ కేసులు నమోదై ఉన్నాయని అలాగే ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఒకటి, మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి బైకు చోరీ కేసులు ఉన్నాయని ఆమె తెలిపారు. అరెస్టు అనంతరం అతని వద్ద నుండి రూ.70 వేల నగదు ఒక బైకు రికవరీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన వెస్ట్ ఇన్‌స్పెక్టర్ మీసాల చంద్రమౌళి, కంచరపాలెం ఎస్సై షేక్ అబ్దుల్ మారుఫ్ వారి టీం సభ్యులను ఆమె అభినందించారు.

53 అంగన్‌వాడీ హెల్పర్స్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ హెల్పర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి కె.వి.రామలక్ష్మి తెలిపారు. భీమునిపట్నం డివిజన్ భీమునిపట్నం ప్రాజెక్టు పరిధిలో 11, విశాఖపట్నం డివిజన్ పరిధిలో పెందుర్తి ప్రాజెక్టులో 21, విశాఖపట్నం ప్రాజెక్టు పరిధిలో 21 వెరసి మొత్తం 53 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. స్థానిక నివాసం కలిగిన వివాహిత స్త్రీలు, ఏడోతరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని, ఈ ఏడాది జులై ఒకటో తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు కలిగి ఉండాలని అన్నారు.

బోటు బోల్తా పడి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ: సముద్రంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు బోటు బోల్తా పడడంతో మత్స్యకారుడు మృత్యువాత పడిన విషాద ఘటన చోటుచేసుకుంది. ఆరిలోవ సిఐ హెచ్. మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివి. జోడుగుళ్ల పాలెనికి చెందిన గరికిన నూకరాజు (36) శుక్రవారం ఉదయం 10 గంటలకు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లాడు. తిరిగొస్తుండగా, సముద్రంలో అలల ఉధృతికి బోటు బోల్తా పడడంతో నూకరాజు మృతి చెందాడు. జోడిగుళ్లపాలెం తీరానికి మృతదేహం కొట్టుకురాగా, పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

105 మద్యం బాటిళ్ల స్వాధీనం

ప్రజాశక్తి- పెందుర్తి : గాంధీ జయంతి అక్రమంగా విక్రయిస్తున్న 105మద్యం బాటిళ్లను పట్టుకుని ఒకరిని పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేసినట్టు సిఐ సతీష్‌కుమార్ తెలిపారు. వివరాలివి. గవర జగ్గయ్యపాలెం గ్రామం, పవన్ సాయి వైన్‌షాప్ సమీపంలో శ్రీను అనే వ్యక్తి నిర్వహిస్తున్న పాన్‌షాప్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారంతో సైమా, సిటిఎఫ్ సిబ్బంది దాడులు నిర్వహించి, లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న 18.870 లీటర్ల, 105 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. అనుమతుల్లేకుండా ఎవరైనా మద్యం అమ్మకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

కార్యాలయాల్లో చొరబడ్డ దొంగలు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లిలోని మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయాల్లో బుధవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. రెండు కార్యాలయాల్లోనూ ఉన్న బీరువాలు తెరిచి రికార్డులు, తదితర కార్యాలయ సామగ్రిని చెల్లాచెదురుగా పారేసారు. అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, గురువారం సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు, క్లూస్ టీం వచ్చి పరిశీలించారు. తహసిల్దార్ కార్యాలయంలో సీసీ ఫుటేజ్ స్టోరేజ్ బాక్స్ మాత్రమే దొంగలించినట్లు గుర్తించారు. మిగతా ఏమి పోలేదన్నారు.

దాడి కేసులో ఐదుగురికి రిమాండ్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ స్టేషన్ పరిధి రవీంద్రనగర్‌లో దాడి కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు స్థానిక ఎస్ఐ సిహెచ్ రామదాసు తెలిపారు. వివరాలివి. బుధవారం రాత్రి రవీంద్ర నగర్‌లో పాత గొడవల నేపథ్యంలో ఐదుగురు వ్యక్తులు కలిసి ఆదర్శనగర్‌కు చెందిన దొడ్డి భానుకిరణ్‌పై దాడి చేసి బీర్ బాటిల్స్‌తో తలపై కొట్టారు. ఈ కేసులో దాడికి పాల్పడిన శ్రీను, జోసెఫ్, కనకరాజు, కిరణ్, సంపత్‌లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సిఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవనిసిఐ మల్లేశ్వరరావు హెచ్చరించారు

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి-సీతమ్మధార: నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ అదృశ్యమైన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. సిఐ ఉమాకాంత్ చెప్పిన వివరాల ప్రకారం, భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు కారణంగా సీతమ్మధార ప్రాంతానికి చెందిన హేమావతి అనే వివాహిత ఇంట్లో నుండి బయటకు వెళ్లిపోయినట్లు ఫిర్యాదు అందిందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఉమాకాంత్ తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని కృష్ణాపురం శివారు కాలనీలో గురువారం కోడిపందేలు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారివద్ద ఉన్న రెండు కోడి పుంజులు, రూ.720నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారికి 41 నోటీసు ఇచ్చి సోమవారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు. పండుగల సందర్భంగా నిషేధించిన కోడి పందేలు, రికార్డింగ్ డాన్స్‌లు వంటివి నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు!

• నిద్రావస్థలో జివిఎంసి టౌన్ ప్లానింగ్

ప్రజాశక్తి-వేపగుంట : ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన అధికారులే కాసులకు కక్కుర్తిపడి నిద్రావస్థలో ఉంటున్నారని పెందుర్తి ప్రాంతంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. చినముసిడివాడ దారి సర్వే నంబర్ 109/1 జిరాయితీ భూమికి ఆనుకొని బంజరు ఉంది. ఇక్కడే సర్వేనెంబర్ 109/2లో అగ్నిమాపక శాఖ సిబ్బందికి కొంత భూమి కేటాయించారు. 109/1పి సర్వే నెంబర్ అని జిఒ 388 పట్టాతో ప్రభుత్వ స్థలాన్ని రోడ్డుగా చూపించారు. జివిఎంసి నుంచి ప్లాన్ తీసుకొని అతి భారీ షెడ్‌ను ప్రజా ప్రతినిధికి సంబంధించిన బంధువు నిర్మించారు. జిఒ 388 పట్టాకు కమర్షియల్ షెడ్ నిర్మించడానికి అనుమతులు ఇవ్వకూడదని నిబంధనలో ఉన్న సరే టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదు. రెవెన్యూ అధికారులు వచ్చి ప్రహరీని మాత్రమే పాక్షికంగా తొలగించారు. దీనిలో భారీ ఎత్తున అధికారులకు ముడుపులు ముట్టాయని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. జోన్ 8 పరిధిలో చాలాచోట్ల బహుళ అంతస్తులు వెలుస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించకపోవడం వెనుక పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక కార్పొరేటర్ దృష్టికి రావడంతో పలుమార్లు జివిఎంసి అధికారులు హెచ్చరించడంతో చిన్న నోటీసు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇది పూర్తిగా బంజరు భూమి అని కొంతమంది వ్యక్తులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు రెండుసార్లు సర్వే చేసినా కాలయాపనతో గడిపేస్తున్నారు. నిర్మాణదారుడు మాత్రం షెడ్ నిర్మాణాన్ని ఆపలేదు. ప్రభుత్వం స్థలాన్ని కాపాడాలని ఒక సామాజిక వేత్త కోర్టును ఆశ్రయించాడు. ముఖ్యమంత్రి వ్యక్తి గత పిఎకు వినతిపత్రాన్ని కూడా అందజేశారు. దీని మీద అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.



అక్రమంగా నిర్మించారని ఆరోపణలున్న భారీ షెడ్

సర్వే ఆధారంగా చర్యలు

చినముషిడివాడ దారి సర్వే నెంబర్ 109/1పి కి ఆనుకొని ప్రభుత్వ భూమి ఉందని మా దృష్టి వచ్చింది. సర్వే చేయాలని తహశీల్దార్‌ను కోరాం. సర్వే రిపోర్టు వచ్చిన తర్వాత చర్యలు చేపడతాం.

- రామలింగారెడ్డి
పట్టణ ప్రణాళిక సహాయాధికారి

ప్రకృతి విధానంలో సాగుతో ప్రయోజనాలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు క్షేత్రాలను శుక్రవారం ఎంపీ ఎం.శ్రీభరత్‌తో పాటు పలువురు వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఏపి రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో అమలవుతున్న 'ఏ' గ్రేడ్, 'ఎనీ టైం మనీ' మోడల్స్‌ను పరిశీలించారు.కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయకుమార్, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, రీజినల్ ఆఫీసర్ ప్రకాష్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అల్లంశెట్టి మోహనరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఎ హెచ్ఆర్ బి శ్రీనివాస చక్రవర్తి, మోడల్ మేకర్ రామారావు మోడల్ ఫీల్డ్ ప్రత్యేకతలను వివరించారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడిన అధికారులు, ప్రకృతి విధానంలో ఆదాయం, పెట్టుబడి ఖర్చులు, లాభనష్టాలపై సమగ్రంగా ఆరాతీశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం రైతులకు సుస్థిరమైన ఆదాయం అందిస్తుందన్నారు. 'ఏ గ్రేడ్', ఎటిఎం మోడల్‌లో విభిన్న పంటలతో ఏడాది పొడవునా ఆదాయం సాధ్యమన్నారు.మట్టి సారవంతం పెంపు, ఖర్చుల తగ్గింపు, ఆరోగ్యకరమైన ఆహారం వంటి అనేక ప్రయోజనాలు ప్రకృతి విధానంలో సాగులో సమకూరుతాయన్నారు.



వ్యవసాయ క్షేత్రంలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

సమయపాలన పాటించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- సీతమ్మధార: వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి, రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని, విధిగా ముఖ హాజరు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు.. శుక్రవారం రేవిడి, శొంఠ్యాం పిహెచ్‌సిలతోపాటు బుచ్చిరాజుపాలెం, లక్ష్మీనగర్, మారికవలస, స్వతంత్ర నగర్, మిధిలాపురి వుడాకాలనీ, వాంబే కాలనీ యుపిహెచ్‌సిలను ఆకస్మికంగా సందర్శించారు. వైద్యసేవలు అందుతున్న తీరును పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో అభ ఐడి రిజిస్ట్రేషన్, ఎన్ఎంల సేవలను సమీక్షించారు. గర్భిణుల సేవలు, ఎన్‌సిడి 4.0 స్క్రీనింగ్, సాధ్యమైనంత వరకు అందరికీ అందుబాటులో ఉండాలని, ఇహెచ్ఐఆర్, ఐహెచ్ఐపి, ఆర్‌సిహెచ్ కూడా నమోదు చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేసారు. జిఎస్‌టి సవరణలతో ఆరోగ్య రంగంలో చేకూరిన ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

మెరుగైన వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భీమునిపట్నం : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న యువకుడు తేజకు మెరుగైన వైద్యం కోసం తోటి స్నేహితులు, పీపుల్ పవర్ సంస్థ సభ్యులు శుక్ర వారం రూ 10,500 ఆర్థిక సాయం అందజేశారు సంస్థ ప్రతినిధులు నిమ్మకాయల భాస్కర్, శివ గోపీనాథ్, అరవింద్ పాల్గొన్నారు



సాయం చేస్తున్న సంస్థ సభ్యులు

నాగేశ్వరరావుకు అభినందన

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 94వ వార్డు బంటా కాలనీ వైసిపి నేత యతిరాజుల నాగేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని, ఆయనకు పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఇసి రాష్ట్ర సభ్యులు శరగడం చిన్న అప్పలనాయుడు, 94వవార్డు అధ్యక్షులు తమర్ల నర్సింగ్, సింహాచలం ట్రస్ట్ మాజీ సభ్యులు సూరిశెట్టి సూరిబాబు, గోవింద పట్నాయక్, జతిన్ పాల్గొన్నారు.

పెన్సిళ్లు, పుస్తకాల వితరణ

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు వేపగుంటలో పలువురు విద్యార్థులకు లాయర్ మహేష్ ఆధ్వర్యంలో పెన్సిళ్లు, పుస్తకాలు వితరణ చేశారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని హోంగార్డు ఆత్మహత్య

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 94 వవార్డు వేపగుంటలో హోంగార్డు అప్పలనాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని ఆర్య రుద్ర కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు పర్యవేక్షిస్తున్న సిఐ సతీష్‌కుమార్ తెలిపిన వివం. వేపగుంట ముత్యాలంబా కాలనీకి చెందిన రుద్ర అప్పలనాయుడు (43) విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోంగార్డుగా, శక్తిటీం ఎంటి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తు న్నారు. గత నెల 30న రాత్రి, ఆర్థిక సమస్యలపై మాట్లాడు కుంటూ భోజనం చేస్తున్న సమయంలో, పడక గదిలోకి వెళ్లి తలుపు లోపల గడియ వేసుకుని, సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. కిటికీ ద్వారా చూసిన భార్య అరుస్తూ, సహాయం కోరగా, కె..ప్రసాద్ అనే వ్యక్తి సహకారంతో చుట్టుపక్కల వారు తలుపు బలవంతంగా తెరిచి, అప్పలనాయుడును గోపాలపట్నం బెహరా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో కెజిహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి, శుక్రవారం మరణించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

గడ్డి మందు తాగి ఇద్దరు మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గడ్డిమందు తాగి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాలివి. మండలంలోని గిడిజాల గ్రామానికి చెందిన కోరాడ సంతోష్ (36). డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య, పిల్లలతో కలిసి నివసిస్తున్న సంతోష్‌కు మద్యం అలవాటు ఉండడంతో, మధ్యాహ్న సమయంలో భార్యతో చిన్న గొడవలు తరచుగా జరుగుతుండేవి. బుధవారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డ సంతోష్, ఆ రాత్రి 7 గంటల సమయంలో మద్యం బాటిల్‌లో గడ్డి మందును కలిపి తాగాడు. అనుమానం వచ్చిన భార్య వెంటనే దగ్గరలో ఉన్న సోదరుని పిలిచి తగరపువలస ఎస్ఆర్ఎ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ, ఆరోగ్యం విషమించడంతో ఆసుపత్రిలో మృత్యువాత పడ్డాడు. సంతోష్ భార్య కోరాడ అచ్చియమ్మ ఫిర్యాదు మేరకు,ఎస్ఐ జి సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసునాయుడు తెలిపారు.

మరో ఘటనలో, కుసులవాడ గ్రామానికి చెందిన లండ వెంకట్రావు (50) కూడా మద్యానికి బానిసై, పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లండ వరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో బాలిక బలవన్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రేమ విషయంలో ఇంట్లో మందలించారని మనస్తాపంతో బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్ సర్వరాజ్ అనే వ్యక్తి జీవనోపాధి కోసం బీహార్ నుండి వచ్చి కుటుంబంతో వచ్చి ఆరిలోవ ప్రగతినగర్‌లో నివసిస్తున్నారు. అతని 14ఏళ్ల కుమార్తె ఆరు నెలలుగా ఒక యువకుడ్ని ప్రేమిస్తున్నట్లు తెలిసి మందలించగా, గతనెల 28న ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించగా, గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బాలికను చికిత్సకు కెజిహెచ్‌కు తరలించారు. ఆరోగ్యం విషమించడంతో గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎలమంచిలి నుండి మృతదేహాన్ని ప్రైవేట్ అంబులెన్స్ లో మహారాష్ట్ర కు తరలిస్తుండగా నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి జంక్షన్ వద్ద హెటిరో కంపెనీ ప్రైవేట్ బస్సు మలుపు తిరుగుతుండగా అంబులెన్స్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎలమంచిలి కి చెందిన అర్జున్,చిన చంకర్ దాదాసో,అనకాపల్లికి చెందిన శివశంకర్ కు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నక్కపల్లి:మండలంలోని ఉద్దండపురం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. మరిడి గంగాధర్ తన భార్య, కుమారుడుతో ఒంగోలు నుండి విశాఖపట్నం కారులో వస్తుండగా ఉద్దండ పురం వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు స్వల్పంగా గాయపడగా,. స్థానిక ఆసుపత్రిలో చికిత్సను అందించారు.

గీతం మూర్తికి ఘన నివాళి



మూర్తి స్మృతివనం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి-మధురవాడ :గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (గీతం) విద్యాలయ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎంవివిఎస్.మూర్తి వర్ధంతిని పురస్కరించుకుని గీతంలోని డాక్టర్.మూర్తి స్మృతివనం వద్ద గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎం..శ్రీభరత్ ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ, సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి పారిశ్రామిక, రాజకీయ, విద్యారంగాలలో డాక్టర్ ఎంవివిఎస్ మూర్తి తనదైన ముద్ర వేశారన్నారు.

గాంధీజీ స్ఫూర్తితో గీతం వర్సిటీని స్థాపించి ఎందరికో విద్య,వైద్యం అందించారన్నారు. జీవితంలో విజయాలను, అపజయాలను సమంగా స్వీకరించడం, అంకితభావం, కష్టపడేతత్వం గీతం.మూర్తి నుంచి నేర్చుకోవాల్సిన విషయాలన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.గంగాధరరావు గీతం ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి, వివిధ కళాశాలల డీన్‌లు, ప్రిన్సిపాల్స్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని డాక్టర్.మూర్తికి నివాళులర్పించారు.

ఆలయ ముఖ ద్వారం ప్రారంభం

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి ఏడో వార్డు పిల్లకోమటివానిపాలెంలో శ్రీ పోతిన నాయుడుబాబు, వెంకటరత్నం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు పోతిన నరసింహనాయుడు ఆర్థిక సహాయం రూ.10 లక్షలతో నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయ ముఖద్వారాన్ని శుక్రవారం దాతలతోపాటు వార్డు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ వెంకటరావు ప్రారంభించారు. పోతిన నరసింహనాయుడు ఆర్థిక సహాయంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పిళ్ళా వెంకటరావు, పోతిన శ్రీనివాసరావు, పోతిన బాలాజీ, నాగోతి నరసింహనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న నిత్యకల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేసిన అర్చక స్వాములు, భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చేసి, పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో కల్యాణతంతును కమనీయంగా జరిపించారు. వేడుకలో భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామి ప్రసాదాలను అందజేశారు. అనంతరం అంతరాలయ దర్శనం కల్పించారు.

కనువిందుగా దీపారాధన

ప్రజాశక్తి - ఆరిలోవ : షిరిడీ సాయిబాబా 107వ మహా సమాధిని వత్సరాన్ని పురస్కరించుకొని నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆలయ చైర్మన్ ట్రస్టీ వానపల్లి అప్పారావు ఆధ్వర్యంలో తొమ్మిది వేల దీపాలతో దీపారాధన కనువిందుగా జరిగింది. ఎయు విశ్రాంత డిప్యూటీ రిజిస్ట్రార్ గవరరాజు,డాక్టర్ పెర్మల్ దంపతులు మొదటి దీపం వెలిగించి దీపారాధన ప్రారంభించారు. అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ పురోహితులు నగేష్ శర్మ, ప్రభాస్ పూజ నిర్వహించారు.

నేడు ఆటో డ్రైవర్లతో సమావేశం

ప్రజాశక్తి- వేపగుంట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆటో డ్రైవర్ల సేవలో పథకంలో భాగంగా ఆటోడ్రైవర్లకు ఏటా రూ.15వేలు ఆర్థికసాయాన్ని అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కూటమి ప్రభుత్వం ప్రారంభించనున్న నేపథ్యంలో జివిఎంసి 95వవార్డు, వేపగుంటలోని వరలక్ష్మినగర్ కాపు కల్యాణ మండపంలో నిర్వహించే కార్యక్రమాన్ని, సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కార్యాలయ వర్గాలు తెలిపాయి. పెందుర్తినియోజకవర్గం పరిధిలోని కూటమి పార్టీల శ్రేణులు, ప్రజాప్రతినిధులు, ఇతర నేతలు హాజరుకావాలని, తమ పరిధిలోని ఆటోస్టాండ్లలోని డ్రైవర్లు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

తుప్పు పట్టిన వ్యాయామ పరికరాలతో

సందర్శకుల తిప్పలు!



తుప్పు పట్టిన ఆట పరికరాలతో ఉన్న జమ్మి చెరువు పబ్లిక్ పార్కు

- ఉత్సాహంగా వచ్చి ఉసూరుమని వెనుదిరుగుతున్న విద్యార్థులు,చిన్నారులు
- కొత్తవి ఏర్పాటు చేయాలని వినతి
- ఇదీ జమ్మి చెరువు పబ్లిక్ పార్కు దుస్థితి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు జమ్మిచెరువు పబ్లిక్ పార్కులో జారుడు బల్ల, ఇతర క్రీడా, వ్యాయామ పరికరాల్లో కొన్ని తుప్పు పట్టాయి. పార్కు ముఖద్వారం వద్ద కొన్ని విద్యుత్ లైట్లు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. విశాలంగా ఉన్న ఈ పార్కులో ఆహ్లాదం కోసం విద్యార్థులు, సందర్శకులు, సీనియర్ సిటిజన్లు ఎక్కువగా వస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పలువురు ఇదే పార్కులో వాకింగ్ చేస్తుంటారు. నిత్యం పని ఒత్తిడికి గురైన వారంతా విశ్రాంతి పొందేందుకు పార్కుకు వస్తుంటారు. తగరపువలస ప్రాంతం నుంచి కూడా ఇక్కడి పార్కుకు కొందరు వస్తుంటారు. ఇలా ఎందరికో సేదదీరేందుకు, ఆటవిడుపుకు నెలవుగా ఉన్న ఈ పార్కులో తుప్పు పట్టిన క్రీడా, ఆట, వ్యాయామ పరికరాలతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో పాడైన వాటిస్థానే కొత్తవి ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు

త్వరలో కొత్త క్రీడా పరికరాలు



జమ్మి చెరువు పబ్లిక్ పార్కులో రూ 42.50 లక్షల జివిఎంసి నిధులతో ఆధునిక క్రీడా, వ్యాయామ పరికరాలను కొద్ది రోజుల్లో ఏర్పాటు చేయనున్నాం.

జి సురేష్, ఎఇఇ,
జివిఎంసి ఒకటో జోన్, భీమిలి

కొత్తవి ఏర్పాటు చేయాలి



తుప్పు పట్టిన క్రీడా, వ్యాయామ పరికరాల స్థానే కొత్తవి ఏర్పాటు చేయాలి. ఉన్న కొన్ని పరికరాలు తుప్పుపట్టిన స్థితిలో ఉండడంతో వాటిపై ఆటలాడేందుకు వచ్చిన విద్యార్థులు, పిల్లలు భయంతో వెనుతిరిగుతున్నారు

– ఎస్. జోగారావు, భీమిలి

పార్కును అందంగా తీర్చిదిద్దాలి



ఇప్పుడున్న పార్కును మరింత అందంగా తీర్చిదిద్దాలి. మరిన్ని సౌకర్యాలు కల్పించాలి. పాడైన ఆట వస్తువులకు బదులుగా కొత్తవి ఏర్పాటుతో అదనంగా మరికొన్ని సమకూర్చాలి.

– సిద్ధు, ఇంటర్ విద్యార్థి

పచ్చదనం నింపాలి



పార్కు ఆవరణలో పచ్చదనం నింపేలా చర్యలు చేపట్టాలి. పచ్చగడ్డితోపాటు వివిధ రకాల మొక్కలను పెంచాలి. పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దితే మరింత మంది వచ్చే అవకాశం ఉంది.

– అశోక్, తగరపువలస

గాలుల బీభత్సానికి రూ.1.78 కోట్ల నష్టం


యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు : ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ ఇమ్మడి

ప్రజాశక్తి- సీతమ్మధార : భారీవర్షాలు, ఈదురుగాలుల బీభత్సానికి ఎపిఇపిడిసిఎల్ పరిధిలో విద్యుత్‌లైన్లకు రూ.1.78కోట్ల నష్టం వాటిల్లిందని సంస్థ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామన్నారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లా పాడేరు ఆరు సర్కిళ్ల పరిధిలో విద్యుత్ లైన్లపై భారీ వక్షాలు, చెట్టుకొమ్మలు, ఫ్లెక్సీ బ్యానర్లు, విరిగిపడిన కారణంగా 33 మండలాలు, 314 గ్రామాల్లో 1,84,328 సర్వీసు కనెక్షన్లకు, 2,126 వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడిందన్నారు. 1700 మంది సిబ్బంది 170బృందాలుగా విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేస్తున్నారన్నారు.దసరా సెలవు అయినప్పటికీ, విద్యుత్ సిబ్బంది సమిష్టిగా పునరుద్ధరణ చర్యల్లో పాల్గొంటున్నారన్నారు. ఈ మేరకు టెలీకాన్ఫరెన్స్‌లో సిబ్బంది అప్రమత్తం చేసి చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యుత్తు అంతరాయాలకు సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబరు 1912కు, కంట్రోలు రూమ్ ఫోన్ నెంబర్లు శ్రీకాకుళం 9490612633, విజయనగరం 94906 10102, విశాఖపట్నం 7382299975, పార్వతీపురం మన్యం 8331983217, సంబంధిత సెక్షన్ కార్యాలయాలకు తెలియచేసి పరిష్కారం పొందవచ్చని సిఎండి పృథ్వీతేజ్ వినియోగదారులకు విజ్ఞప్తి చేసారు.

విద్యుత్ సమాచారం కోసం కంట్రోల్ రూం ఏర్పాటు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఈదురుగాలులు, భారీ వర్షానికి అతలాకుతలమై తీవ్రంగా దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించామని ఎపిఇపిడిసిఎల్ విశాఖపట్నం సర్కిల్ ఎస్ఇ జి.శ్యాంబాబు తెలిపారు. గురువారం ఉదయం తీవ్రగాలుల ప్రభావానికి నగర పరిధిలోని మూడు డివిజన్లలో చాలా చోట్ల విద్యుత్ లైన్లపై భారీ వృక్షాలు, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయని, దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయంతోపాటు విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లిందన్నారు. విశాఖపట్నం సర్కిల్ పరిధిలో 33/11 కెవి ఫీడర్లు 95 ఉండగా, వాటిలో 39ఫీడర్లు దెబ్బతిన్నాయని, 11 కెవి ఫీడర్లు 574 ఉండగా వాటిలో 120 దెబ్బతిన్నాయన్నారు. అదేవిధంగా చెట్ల కొమ్మలు విరిగిపడిన కారణంగా 33 కెవి, 11 కెవి ఫీడర్లలో 65 విద్యుత్ స్తంభాలు పడిపోగా వాటన్నిటిని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించామని ఎస్ఇ వెల్లడించారు. గాలుల దెబ్బకు తెగిపడిన విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్ఫార్మర్లను సరిచేయడానికి అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను అందుబాటులో ఉంచుకొని, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచామన్నారు. విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ వైర్లు, ఇంకా ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, విద్యుత్ లైన్లపై చెట్లు కొమ్మలు పడి ఉన్నందున వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్ఐ శ్యాంబాబు సూచించారు. ప్రజల సమాచారం కొరకు 24x7 కంట్రోలు రూమ్‌ను అందుబాటులో ఉంచామని, విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాల సమాచారాన్ని 1912టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియచేయాలని ఎస్ఇ శ్యాంబాబు కోరారు.

వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఆనంద్



మజ్జి శ్రీనుకు చిత్రపటం బహూకరిస్తున్న ఆనంద్

ప్రజాశక్తి - ఆనందపురం: వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ దబ్బంద గ్రామానికి చెందిడోల ఆనంద్‌ను నియమించారు. ఈసందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావును కలిసి, వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆనంద్ మాట్లాడుతూ, పార్టీ తనకు అప్పగించిన పదవిని బాధ్యతగా నిర్వహించి, పార్టీ బలోపేతానికి, రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి డోల దేముడు,ఎంపిటిసి డోల గౌతమి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ నగర్‌లో ఉన్న ఆనంద మార్గ ఆశ్రమంలో పరిసర ప్రాంతాల్లో ఉన్న పేదలకు ఆశ్రమ ప్రతినిధులు 300 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వాహకులు సౌమ్యానంద అవధూత మాట్లాడుతూ ప్రతి ఆదివారం 9 గంటల నుండి 12 గంటల వరకు ఆశ్రమంలో ఉచిత హోమియో వైద్య శిబిరం జరుగుతుందని, ఈ సదవకాశాన్ని పరిసర ప్రాంత వాసులు వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఇష్ట ప్రేమానంద అవధూత, ఏఎన్ రాజు వైఎఎన్ రాజు, వైఎస్‌ఎన్ రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై అవగాహన



ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న ఎస్‌ఎంసి సభ్యులు

ప్రజాశక్తి -తగరపువలస : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాపరంగా కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పిస్తూ భీమిలి మండలం తాటితూరు జెడ్‌పి హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ బి సోమేశ్వరరావు, కమిటీ సభ్యులు శుక్ర వారం ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. దసరా పండుగ సెలవులు ముగిసిన వెంటనే పిల్లలను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను వారు కోరారు.

టెన్త్ ఒరిజినల్ సర్టిఫికెట్ల పంపిణీ

ప్రజాశక్తి-ఆనందపురం: గత విద్యాసంవత్సరం ఉత్తీర్ణులైన వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు 29 మందికి శుక్రవారం పాఠశాలలో ఒరిజినల్ పాస్‌సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాలలో గతేడాది టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రధానోపాధ్యాయులు దాడిశెట్టి రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో అవార్డులు



అవార్డుకు ఎంపికైన ఎంవిపి రైతు బజారు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో విశాఖ జిల్లాకు 7 రాష్ట్ర స్థాయి అవార్డులు, 44 జిల్లా స్థాయి అవార్డులు దక్కాయి. దీనిపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. తాజా అవార్డుల్లో జివిఎంసికి స్వచ్ఛ సర్వేక్షణ్ కేటగిరీ అవార్డు దక్కింది. సింహగిరి కాలనీ మహిళా సమాఖ్యకు స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ఎస్‌గా, పెందుర్తి మండలం గోరపల్లికి స్వచ్ఛ గ్రామ సమాఖ్యగా, నడుపూరు జెడ్‌పి హైస్కూలుకు స్వచ్ఛ పాఠశాలగా, ఎంవిపి.కాలనీ రైతు బజార్‌కు స్వచ్ఛ రైతు బజార్‌గా, లోటస్ వైర్లెస్ టెక్నాలజీకి స్వచ్ఛ ఎంఎస్ఎంఇగా, తిరుమల నగర్ రెసిడెన్షియల్ కాలనీకి స్వచ్ఛ కాలనీగా రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయి. అలాగే జిల్లా స్థాయిలో స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ బస్‌స్టేషన్లు, స్వచ్ఛ ఎన్‌జిఒలు, స్వచ్ఛ ఆసుపత్రులు వంటి విభాగాల్లో 44 అవార్డులు దక్కాయి. తమ రైతు బజారుకు స్వచ్ఛ రైతు బజారుగా అవార్డు దక్కడం పట్ల ఎంవిపి రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కె.వరహాలు ఆనందం వ్యక్తం చేశారు. తమ రైతు బజారులోని స్వచ్ఛతకు ఎంతటి ప్రాధాన్యతనిచ్చిందీ తెలియజేశారు.

అనకాపల్లి జిల్లాకు 5 రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు

అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రకు సంబంధించి ఆరోగ్యకరమైన పోటీ నెలకొల్పేందుకు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అవార్డులను ఈనెల 6న అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఐదు, జిల్లాస్థాయిలో 45 అవార్డులు వచ్చినట్లు పేర్కొన్నారు. పంచాయితీ రాజ్, మున్సిపాలిటీ, ఐసిడిఎస్, ఎన్జీవో, ఏపీఎస్ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, సంక్షేమ, పరిశ్రమలు, విద్య, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి శాఖలు అవార్డులు పొందిన వాటిలో ఉన్నాయని తెలిపారు. ఈనెల 6న జిల్లా ఇన్చార్జి మంత్రి, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డుల ప్రదానం ఉంటుందన్నారు.

చౌడువాడకు రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని మేజర్ పంచాయితీ చౌడువాడకు రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర-2025 అవార్డుకు ఎంపికైనట్లు ఆ గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడు, పంచాయితీ కార్యదర్శి పాలూరి సురేష్ బాబు తెలిపారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా తయారు చేయడంతో పాటు. గ్రామంలో ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్తను సంపద కేంద్రానికి తరలించి అక్కడ వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేసి దానిని సేంద్రియ ఎరువుగా కావలసిన రైతులకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. తమ గ్రామాన్ని అనేకమార్లు జిల్లాస్థాయి పర్యవేక్షణ బృందాలు వచ్చి ప్రతి వీధికి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆరు మున్సిపాలిటీలకు. ఆరు పంచాయితీలకు ఈ అవార్డులు ప్రకటించగా, ఉత్తరాంధ్ర జిల్లాలో చౌడువాడ పంచాయతీకి ఈ అవార్డు రావడం తమక ఆనందంగా ఉందని చెప్పారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి, జిల్లాస్థాయి అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును ఈనెల 6న విజయవాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాన్ని పరశుభ్రంగా ఉంచుతున్న పంచాయితీ పారిశుధ్య కార్మికులకు, గ్రామ ప్రజలకు, పంచాయితీ జూనియర్ అసిస్టెంట్ జి అప్పారావుకు అభినందనలు తెలిపారు.



వర్మీ కంపోస్టును విక్రయిస్తున్న దృశ్యం



గణేష్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకులు గెడ్డం బుజ్జి తదితరులు

పారా వాలీబాల్ క్రీడాకారుడు గణేష్‌కు సత్కారం

ప్రజాశక్తి-పాయకరావుపేట : అమెరికాలో ఈ నెల 12వ తేదీ నుంచి జరుగబోయే పారా వాలీబాల్ వరల్డ్ కప్ టీమ్‌కు ఎంపికైన ఎస్ రాయవరం మండలం, సోముదేవపల్లి గ్రామానికి చెందిన అన్నం గణేష్‌ను జనసేన పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి గెడ్డం బుజ్జి శుక్రవారం ఘనంగా సత్కరించారు. గెడ్డం బుజ్జి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో గణేష్‌ను శాలువాలతో సత్కరించి అభినందించారు. నగదు ప్రోత్సాహకం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గెడ్డం బుజ్జి మాట్లాడుతూ పారా వాలీబాల్ వరల్డ్ కప్‌లో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం వైపు నుంచి కూడా ప్రోత్సాహం అందేలా చూస్తానని గణేష్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గెడ్డం ఆకాష్ బాబు, లింగంపల్లి జ్యోతి కుమార్, తేటకాలి అరవింద్, వినోద్ రాయల్స్, మాలెం రాజు, వీసం సాయి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బివి.సత్యవతికి అభినందనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా నియమితులైన అనకాపల్లి మాజీ ఎంపీ డాక్టర్ బివి సత్యవతిని శుక్రవారం ఆ పార్టీ నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. ఎంపీగా డాక్టర్ సత్యవతి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సూరిశెట్టి రమణ అప్పారావు, ఏడువాకల నారాయణరావు, సత్యనారాయణ మాస్టర్ పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుతో రైతుకు లాభం : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిఎస్‌టి తగ్గింపుతో రైతుకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. సూపర్ సేవింగ్స్ సూపర్ జిఎస్టిలో భాగంగా శుక్రవారం అనకాపల్లిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణలతో కలిసి కలెక్టర్ ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగంలోని ఉపయోగించే వస్తువులు, పనిముట్లు, వ్యవసాయ యంత్రాలపై జిఎస్టి 12 శాతం నుంచి 5శాతానికి తగ్గించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, కూటమి నాయకులు డి.పరమేశ్వరరావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు మాకవరపాలెం మండల సమావేశం

ప్రజాశక్తి-కోటవురట్ల : మాకవరపాలెం మండల పరిషత్తు సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించినట్లు ఎంపీడీవో ఛాయసుధ తెలిపారు. ఎంపీపీ సర్వేశ్వరరావు అధ్యక్షతన జరుగు ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల, గ్రామస్థాయి అధికారులు హాజరై సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని కోరారు.

డైట్‌లో ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో బిఎస్ఎన్ఎల్ సహకారంతో శుక్రవారం రూ.17 లక్షల విలువ గల రీసెర్చ్, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ శుక్రవారం ప్రారంభమైంది. ఎంఎస్ఎంఈ డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.ప్రసాద్‌రెడ్డి, బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎం సత్య ప్రసాద్ హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఇన్క్యుబేషన్ ల్యాబ్ విద్యార్థులకు, అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఐదు రోజుల పాటు డైట్ అధ్యాపకులకు "ఫ్యాకల్టీ డెవలప్మెంట్స్ ప్రోగ్రాం" బిఎస్ఎన్ఎల్ వారి సహకారంతో ఈసిఈ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ జి.వి.శ్రీధర్ చెప్పారు. "అన్ఫోల్డింగ్ నెక్స్ట్- జెన్ నెట్వర్క్ ఇన్ టర్మ్ ఆఫ్ ఇండస్ట్రీ ఆటోమేషన్"పై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను 7వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. ఈ ఎఫ్‌డిపి ద్వారా అధునాతన టెక్నాలజీ ఐఓటి, ఏఐ, డ్రోన్ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ ఐఓటిలలో అధ్యాపకులకు అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో డైట్ కళాశాలలో ఫ్యాక్టరీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, ఈ.సి.ఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణ ప్రియ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో చైతన్య ప్రతిభ



మెడల్ చూపుతున్న చైతన్య

ప్రజాశక్తి-దేవరాపల్లి : : ఎపి స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2025లో దేవరాపల్లి మండలం వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని బోడబల్ల చైతన్య ప్రతిభ కనబరిచింది. పెంటాథ్లాన్ విభాగంలో అండర్-16 గర్ల్స్ కేటగిరీలో రెండవ స్థానం సాధించి మెడల్‌తో పాటు, ప్రశంసా పత్రాలను అందుకుంది. ఈ పోటీలు ఇటీవల గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో జరిగాయి. చైతన్య కఠిన శ్రమ, క్రమశిక్షణ ఫలితంగా ఈ విజయం సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.వెంకటరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఆమె విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి సందీప్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : విధిగా ప్రతి ఇంటి వద్ద చెత్త సేకరణ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ ఆదేశించారు. అచ్యుతాపురం గ్రామపంచాయతీ పరిధిలో చెత్త సేకరణపై శుక్రవారం ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. చెత్త సేకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చెత్త సేకరణతో పరిసరాల పరిశుభ్రత, ఆర్థికపరమైన లాభాలు చేకూరుతాయని తెలిపారు. ఆయన వెంట డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో బాబురావు, స్థానిక నాయకులు కె.విమల నాయుడు, లాలం అప్పాజీ తదితరులున్నారు.



ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడుతున్న డిపిఒ సందీప్

రుణాల మంజూరులో రైతులకు ప్రాధాన్యత

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-చోడవరం : సహకార సంఘాల రుణాల మంజూరులో రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సహకార సంఘాలకు కొత్తగా నియామకమైన పర్సన్ ఇన్‌ఛార్జులకు చోడవరం సీతారామ కళ్యాణ మండపంలో డిసిసిబి ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్కరోజు శిక్షణా కార్యక్రమంలో అయ్యన్న ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు, చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేయాలని, పెద్ద పెద్ద ధనవంతులకు రుణాలు మంజూరు చేస్తే వారు సరిగా కట్టరు సరి కదా మనల్ని కోర్టు చుట్టూ తిప్పుతారని పేర్కొన్నారు. సంఘాల్లో అధ్యక్షులు కార్యదర్శుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఫైల్‌ను క్షుణ్ణంగా పరిశీలించి సంతకాలు చేయాలని, అలా కాకుండా ఏదో పదవి వచ్చింది కదా అని అజాగ్రత్తగా ఉన్నట్లయితే అవినీతి జరిగే ఆస్కారం ఉందని తెలిపారు. ప్రతి సహకార సంఘంలోనూ ఇకపై ఎరువుల అమ్మకాలు చేపట్టాలన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సహకార సంఘాలను బలోపేతం చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ సహకార సంఘాలకు భవిష్యత్‌లో జరగే ఎన్నికల్లోనూ పర్సన్ ఇన్‌ఛార్జులే అధ్యక్షులుగా ఎన్నిక కావాలని, అందుకోసం రైతులతో మమేకమై సంఘాన్ని సక్రమంగా నడిపించాలని సూచించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షులు కోన తాతారావు మాట్లాడారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ సీఈవో వర్మ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న 98 సహకార సంఘాల అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఆర్‌జెడి విజయభాస్కర్

ప్రజాశక్తి-సబ్బవరం : విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పాత్ర కీలకమైనదని జోన్-1 ఆర్‌జెడి విజయభాస్కర్, డిఈఓ జి.అప్పారావు నాయుడు అన్నారు. మండలంలోని గొట్టివాడ వద్ద దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో డిఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు ఎనిమిది రోజులపాటు జరుగుతాయని చెప్పారు. వృత్తి నైపుణ్యం ఎలా పెంపొందించుకోవాలో, వృత్తిలో ఎదుర్కోవాల్సిన సవాళ్లను, విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలను అందించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అప్పారావు, అకాడమిక్ మోనిటరింగ్ అధికారి కేజీయా, ఎంజీవో-1 ఎస్.లక్ష్మణరావు, ఎంఈవో-2 ఎంజె రవీంద్రబాబు, సీనియర్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య కేంద్రాన్ని సందర్శించిన టాస్క్‌ఫోర్స్ బృందం

టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవలపై గ్రామస్థాయిలో ప్రజలకు అందుతున్న తీరును పరిశీలించడానికి అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం తురకలపూడి పిహెచ్‌సి పరిధి ఆర్.శివరాంపురం ఆయుష్మాన్ కేంద్రంలో శుక్రవారం తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, కౌమారదశ బాలికలకు వైద్య పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో టీం లీడర్ డాక్టర్ ప్రశాంతి, స్టాటిస్టికల్ ఆఫీసర్ రామచంద్రరావు, డిపిఓ జగదీష్, ఎంపిహెచ్ఈఓ రాజశేఖర్, రమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పది రోజులుగా వెలగని వీధి లైట్లు

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని మిలట్రీకాలనీ 12వ వార్డులో గత పదిరోజులుగా వీధి లైటు వెలగడం లేదని కాలనీ వాసులు శుక్రవారం ప్రజాశక్తి దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలదని వాపోయారు. విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేస్తే అది మున్సిపాలిటీ పరిధిలోని సమస్యగా చెబుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే మున్సిపల్ ఇంజనీరింగు సిబ్బంది చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చోడవరం : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న ఆదివారం విజయవాడ బాలోత్సవ భవన్‌లో విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న రౌండ్ టేబుల్ మీటింగ్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విద్యుత్తు కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకులు వేపాడ సత్యనారాయణ, ప్రేమ్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణలో భాగంగా కాంట్రాక్ట్ కార్మికులు వ్యవస్థను తీసుకొచ్చి ఇప్పటికీ 27 వేల మందికి పైగా కార్మికుల్ని రెగ్యులర్ చెయ్యకుండా రెగ్యులర్ ఉద్యోగికి ఇచ్చే జీతంలో 5వ వంతు ఇస్తూ శ్రమని దోచుకుంటుని ఆవేదన వ్యక్తం చేశారు.

పని గోరంత.. ప్రచారం కొండంత..

ప్రజాశక్తి-అనకాపల్లి : కూటమి నాయకులు చేసే అభివృద్ధి గోరంత, చేసుకునే ప్రచారం కొండంత అన్న తీరులో ఉందని బిఎస్‌పి అనకాపల్లి జిల్లా ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు విమర్శించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని తుమ్మపాల ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న వర్షపు నీటిని శుక్రవారం బిఎస్‌పి నేత వనమాల నాగభూషణంతో కలిసి మాణిక్యాలరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు పోయేందుకు కాలువలు లేకపోవడంతో తుమ్మపాల మెయిన్ రోడ్డు చెరువును తలపిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రహదారులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని చెబుతున్న కూటమి నేతలు, వారి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని పేర్కొన్నారు.

రోడ్డుకిరువైపులా తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని షేకిళ్లపాలెం పంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలు తొలగించే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. వర్షాలకు గ్రామంలోని రోడ్లకు ఇరువైపులా పిచ్చితుప్పలు పెరిగాయని, దోమల బెడద ఎక్కువౌతుందని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు స్థానిక సచివాలయ కార్యదర్శి ఉమాదేవితో కలిసి సచివాలయం సిబ్బంది గ్రామ నలుమూలలా పర్యటించి పారిశుధ్య కార్యక్రమం చేపట్టినట్లు ఎంపిడిఓ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.



తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-పరవాడ : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) సమావేశం పరవాడ మండలం తానాం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ సుమారు 7 సంవత్సరాలుగా సంక్షేమ బోర్డులో కార్మికులకు అందాల్సిన పథకాలను అమలు చేయలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిలిపివేస్తూ 1214 మెమోను జారీ చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు అందిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, కూటమి ప్రభుత్వం కూడా కార్మికులను మోసగిస్తుందని ఆరోపించారు. సంక్షేమ బోర్డులో ఉన్న కోట్లాది రూపాయల నిధులను ప్రభుత్వం తన అవసరాలకు ఉపయోగిస్తుంది తప్ప సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్న 32 రకాల నిర్మాణ కార్మికులకు ఎటువంటి సహాయం అందించలేదని పేర్కొన్నారు. ఈ ఏడేళ్ల కాలంలో అనేకమంది కార్మికులు ప్రమాదాలకు గురై వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని, అయినా సంక్షేమబోర్డు నుండి సహాయం అందించకపోవడం దారుణమన్నారు. కార్మికులు పోరాడితే తప్ప సంక్షేమ బోర్డును కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.చిరంజీవి, నాయకులు జి.సన్యాసిరావు, రొంగలి కన్నంనాయుడు, పి.వీరునాయుడు, త్రినాథ్, అప్పారావు, శ్రీను, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాటం

అచ్యుతాపురం : భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము పిలుపునిచ్చారు. అచ్యుతాపురంలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల కు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ కె సోము నాయుడు, భవన నిర్మాణ కార్మిక కార్మిక సంఘం నాయకులు రాజన్న అప్పలనాయుడు, కె రాజు, ఎల్ శ్రీను, పైడిరాజు, నాగేశ్వరరావు, వసంత చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు .

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించం

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాజకీయ కక్షలతో గ్రామాలలో శాంతిభద్రతలను భంగం చేసేందుకు ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదని, రౌడీషీట్లు తెరవడానికీ వెనుకాడబోమని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి హెచ్చరించారు. దేవరాపల్లి మండల కేంద్రంలో గురువారం రాత్రి రెండు వర్గాలు పరస్పరం ఘర్షణకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. బంధువుల మధ్య వాట్సాప్ చాటింగ్‌లో జరిగిన రాజకీయ విమర్శలు తీవ్రమై ఇరు వర్గాల వారు బాహాబాహీకి దిగారు. సకాలంలో పోలీసులు జోక్యం చేసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీనిపై ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేశారు. ఈ ఘటనపై ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు శుక్రవారం డీఎస్పీ ఎం.శ్రావణి దేవరాపల్లి పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఇరు వర్గాల వారిని పిలిపించి గట్టిగా హెచ్చరించారు. వ్యక్తిగత విభేదాలు, రాజకీయ కక్షలను ఆసరాగా తీసుకుని సమాజంలో కలహాలు రేపేవారిని అసలు సహించబోమని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, రాజకీయ ముసుగులో రౌడీయిజం చెయ్యాలని చూసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఘటనలో ఇరు వర్గాలకు చెందిన పది మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యగా వారిని తహసీల్దారు వద్ద బైండోవర్ చేయాలని ఎస్ఐని ఆదేశించినట్లు తెలిపారు. ఆమె వెంట ఎ.కోడూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ, పోలీసులు ఉన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రావణి



శిథిలమై, తుప్పలు పెరిగిన పాఠశాల భవనం

ఆందోళన కలిగిస్తున్న శిథిల భవనాలు

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న శిథిల భవనాలు సిబ్బందికి, విద్యార్థులకు ఆందోళన కలిగిస్తున్నాయి. 1976లో నిర్మించిన పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో దాదాపు 15 సంవత్సరాల క్రితం కొత్త భవనాలు నిర్మించి వాటిల్లో పాఠశాలను నిర్వహిస్తున్నారు. నాటి నుండి ఈ భవనాలు వినియోగంలో లేకపోవడంతో పూర్తిగా శిథిలమయ్యాయి. ఆ భవనాలను నేటికీ తొలగించకపోవడంతో ప్రస్తుతం ఈ శిథిల భవనాలపై వృక్షాలు పెరిగి ఆందోళన కలిగిస్తున్నాయి. తుప్పలు పెరిగిపోవడంతో వాటిల్లో విషసర్పాలు కూడా సంచరిస్తున్నాయి. ఈ శిథిల భవనాలకు సమీపంలోనే మధ్యాహ్న భోజన పథకం వంటశాల నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో, ఏ విషసర్పం కాటు వేస్తుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిల భవనాలను తొలగించాలని కోరుతున్నారు.

12న జనరాజుదాస్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-మునగపాక : కీర్తిశేషులు పెంటకోట జనరాజు దాస్ జయంతి వేడుకలు ఈనెల 12న నిర్వహించనున్నట్లు గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ, గ్రామీణ యువజన మందిరం నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు యువజన మందిరం ఆవరణలో శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ జయంతి రోజు రాత్రి 6.30 గంటలకు స్థానిక నందీశ్వర కళా ప్రాంగణంపై ఎందరో సినీ ప్రముఖులకు నటనలో శిక్షణ ఇచ్చిన విశాఖపట్నం వాస్తవ్యులు లంక సత్యానంద్‌ను సత్కరించడం జరుగుతుందని చెప్పారు. 7 గంటలకు గంటలకు డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీసాయి బాబా నాట్యమండలి విజయవాడ వారిచే "జయహో శ్రీచత్రపతి శివాజీ మహారాజ్" అనే చారిత్రాత్మక నాటకం ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సూరిశెట్టి రాము, ఆడారి శ్రీకాంత్, అడారి గంగ మహేష్, దాడి ముసలి నాయుడు, పెంటకోట విజయ్, కాండ్రేగుల జగ్గారావు, టెక్కలి కొండలరావు, పెంటకోట వెంకట్, ఆడారి గణేష్, మల్ల రామ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

గూగుల్‌ను అడ్డుకునే ప్రయత్నం సరికాదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా రూ.55వేల కోట్లు పెట్టుబడితో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందని, దానికి రైతుల నుండి 200 ఎకరాలు సేకరించడానికి నిర్ణయించగా, మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ఉంటే వైసిపి నేతు కోర్టుల్లో కేసులు వేయడం దారుణమన్నారు. ప్రముఖ టిసిఎస్ కంపెనీకు భూములు కేటాయింపుపై వైసీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించి హైకోర్టు జడ్జి చేత చివాట్లు తిన్నప్పటికీ వారికి బుద్ధి రాలేదని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ శాఖ ఉపాధ్యక్షులు బోడి వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధిపై వైసిపి కుట్రలు చేయడం తగదు

అచ్యుతాపురం : కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై వైసీపీ నేతలు కుట్రలు చేయడం తగదని రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్చుతాపురంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా ఆరు బిలియన్ డాలర్ల పెట్టుబడితో అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ సంస్థ ముందుకొస్తే భీమిలిలో రైతుల ముసుగులో వైసీపీ నేతలు కోర్టులో కేసులు వేశారని ఆరోపించారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీల తులసీరామ్, కాండ్రేగుల అప్పారావు, క్లస్టర్ ఇంచార్జ్ యాండ్రా అప్పలనాయుడు, లాలం రాజు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు గృహోపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కింతాడ పంచాయతీ పరిధి కూండ్రపువానిపాలేనికి చెందిన శ్రీరావలమ్మ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ అధినేత కన్నూరు సూర్యనారాయణ భవన నిర్మాణ కార్మికులు 70 మందికి దాదాపు రూ.5 లక్షల విలువైన వస్త్రాలు, వివిధ గృహోపకరణాలు, మిఠాయిలు, ఆహారపొట్లాలను గురువారం ఎ.కోడూరు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ చేతుల మీదుగా పంపిణీ చేయించారు. కార్యక్రమంలో శ్రీసత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, జిల్లా సహ సమన్వయకర్త కన్నూరు అప్పలనాయుడు, శ్రీరావాలమ్మ తాపీ మేస్త్రీల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



గృహోపకరణాలు అందిస్తున్న సూర్యనారాయణ

బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా ...

మత్స్యకారుల నిరసన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు

ప్రజాశక్తి -నక్కపల్లి: మత్స్యకారుల జీవన విధా నానికి, ఉపాధిని దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్కును నిలుపుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు డిమాండ్ చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత దీక్షలు శుక్రవారం నాటికి 20 వ రోజుకు చేరింది. బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ నాయకులు, మత్స్యకారులు భిక్షాటన చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బల్క్ డ్రగ్ నిలుపుదల చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇప్పటికే హెటిరో కంపెనీ కాలుష్యం సముద్రంలో వదలడంతో మత్స్య సంపద అంతరించిపోవడంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డారన్నారు. ఈ ప్రాంతంలో వేట సాగక పోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. కంపెనీ కాలుష్యంతో గ్రామంలో అనేకమంది క్యాన్సర్, శ్వాస కోసం వంటి వ్యాధుల బారిన పడి ఇప్పటికే అనేకమంది మృతి చెందడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుందని, వారి ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని తెలిపారు. మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని బల్క్ డ్రగ్‌ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల తలపెట్టిన పోరాటానికి అండగా ఉంటామని నాయకులు హామీ ఇచ్చారు. బల్క్ డ్రగ్ నిలుపుదల చేసే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బి.బాబ్జి, మత్స్యకార నాయకులు గోసల సోమేశ్వరరావు, పిక్కి తాతీలు, సోములు, సూరిబాబు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎంపిడిఒ

వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకుల్లో తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో డి.సీతారామరాజు తెలిపారు. మండలంలో సిహెచ్ లక్ష్మీపురంలో వాటర్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. అనంతరం శానిటేషన్ పనులను పరిశీలించారు. శానిటేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.




స్టూడియోను పరిశీలిస్తున్న పద్మావతి

ఫ్యాషన్ డిజైన్ స్టూడియో ప్రారంభం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: పెదబొడ్డేపల్లిలో మహిళా మణులకు ఫ్యాషన్ డిజైన్స్ సంబంధించిన నిత్యాస్ డిజైనర్ స్టూడియో స్టూడియో ప్రారంభమైంది. ఈ ప్రారంబోత్సవంలో కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కళావతి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నర్సీపట్నం లో డిజైనింగ్‌కు సంబంధించి అన్ని రకాల డిజైన్స్ స్టూడియో ఏర్పాటు చేసిన ఆదిలక్ష్మికి అభినందనలు తెలిపారు. డిజైన్ స్టూడియో లో స్టిటిచ్చింగ్, మగ్గం వర్క్, శారీ రోలింగ్, శారీ పాలిషింగ్, కంప్యూటర్ ఎంబ్రాయిడర్, డ్రై క్లీనింగ్, మోడల్ ఫ్రాక్ డిజైన్ చేస్తామని ఆదిలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు మాజీ ఎంపీ మాదవి, గుదిబండ నాగేశ్వరరావు, గొలుసు నరసింహామూర్తి, అద్దేపల్లి గణేష్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పనులు ప్రారంభించాలి

-9న మాజీ సిఎం జగన్ పర్యటన - మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: గత వైసిపి ప్రభుత్వంలో మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం వద్ద మెడికల్ కాలేజీ నిర్మాణం నిమిత్తం కోట్లాది రూపాయలు మంజూరు చేయడం పనులు ప్రారంభించడం జరిగిందని, తక్షణమే పనులు ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ డిమాండ్ చేశారు. ఇటీవల చేపట్టిన నిరసన కార్యక్రమంలో భారీ స్థాయిలో వైసీపీ శ్రేణులు పాల్గొన్నారని, .అందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనుమతులు లేని మెడికల్ కాలేజీని ఎందుకు నిర్మిస్తామంటూ సవాల్ విసిరారన్నారు.. అయ్యన్న సవాలుకు సమాధానం గానే ఈనెల 9వ తేదీన మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం నియోజకవర్గంలో గల మెడికల్ కాలేజీ పరిశీలించనున్నారన్నారు.ఇందులో భాగంగా గురువారం వైఎస్ఆర్సిపి ప్రోగ్రామ్స్ కన్వీనర్ తలశిల రఘురాం, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి వైసీపీ పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, విశాఖపట్నం వైసీపీ జిల్లా అధ్యక్షులు కేకే రాజు తదితరులు కాలేజ్ నిర్మాణ పనులను పరిశీలించారు.

6న వాహనాల వేలంపాట

ప్రజాశక్తి-నర్సీపట్నం: గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడ్డ నాలుగు ద్విచక్ర వాహనాలకు ఈనెల 6న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్ తెలిపారు, విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నర్సీపట్నం ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఉదయం 10:30 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు, వేలంపాటలో పాల్గొనేవారు దరావత్తు నిమిత్తం ఐదువేల రూపాయలు చెల్లించవలసి ఉంటుందన్నారు.

కోన తాతారావును కలిసిన చిన్నా

ప్రజాశక్తి-రావికమతం: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కోన తారావును రావికమతం మండలం మేడివాడ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు గూటాల చిన్న శుక్రవారం చోడవరంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కోపరేటివ్ సొసైటీ ఆర్థిక పరిస్థితులను తెలియజేశారు. సొసైటీ ఆర్థికంగా కొట్టుమిట్టాడుతుందని, గత పాలక వర్గం నిర్లక్ష్య దోరణి కారణంగా ఈ సొసైటీ నష్టాల ఊబిలో చిక్కుకుందన్నారు. దీనిని తిరిగి మన ప్రభుత్వంలో అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేయాలని కోరామన్నారు.



సత్కరిస్తున్న చిన్నా

పలు చోట్ల గ్రామసభలు



పాయకరావులో హాజరైన అధికారులు, ప్రజలు

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని ఈదటం గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ పిర్ల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామంలో చాలా కాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు గ్రామస్తులు అధికారులను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె భీమరాజు, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని ఉప్పరాపల్లి, వాకపాడు గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎంపీడీవో బంగారి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామసభలు విజయవంతమవుతాయని చెప్పారు. ఉప్పరాపల్లిలో సర్పంచ్ ఎస్. శ్రీరాములు ఉప సర్పంచ్ జి. చిన్నారావు, పంచాయతీ కార్యదర్శి కెవి.శ్రీనివాస్ పాల్గొన్నారు .

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ సచివాలయం వద్ద శుక్రవారం గ్రామసభ గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ఆధ్వర్యంలో జరిగింది. 29 డిపార్ట్మెంట్‌లకు చెందిన గ్రామస్థాయి అధికారులు ఈ గడిచిన మూడు నెలల వ్యాధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టవలసిన కార్యక్రమాల నివేదికను తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.సురేష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ జి.అప్పారావు, గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలో పలు గ్రామాలలో పంచాయతీ గ్రామసభలు శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ పంచాయతీ సర్పంచ్ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. చినపాచిల, గుమ్మాలపాడు, కవగుంట, మరుపాక, గొంప, తట్టబంద, గర్నికం, మేడివాడ, మర్రివలస, కన్నంపేట, వోమ్మవరం తదితర పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించారు ఈ సభలలో సచివాలయాల సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగుల పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో పంచాయితీ పాలకవర్గ సభ్యులు, కొంతమంది అధికారులు మినహా ప్రజలు అంతంతమాత్రంగా వచ్చారు. సమస్యలు అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లాలనుకున్న సమయంలో నిర్వహించిన ఈ గ్రామ సభకు ప్రజలకు కనీస సమాచారం ఇవ్వకపోవడం పై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామసభ నిర్వహించిన తీరిపై కూటమి నాయకులే కాకుండా ప్రజలు కూడా తీవ్ర సహనం వ్యక్తం చేస్తున్నారు.

గొలుగొండ : మండలంలో సిహెచ్ నాగపురం, లింగంపేట పంచాయతీలలో సర్పంచ్లు యలమంచిలి రఘురామచంద్రరావు, తోకల సంతోష్ కుమార్‌ల అద్యక్షతన శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, తాగు నీరు డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచడం వంటి అంశాలపై చర్చించి తీర్మానించారు. ఈ కార్యక్రమంలో లింగంపేట పంచాయతీ కార్యదర్శి శివ, ఎన్ఆర్ఈజీఎస్ విఆర్పిలు రమణ, సిహెచ్ నాగ పురం ఉపసర్పంచ్ సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొత్తకోట: గ్రామ పంచాయతీలో తీర్మాణం చేసి ఆలయాల చెంతన ఉన్న మాంసం దుకాణాలను అక్కడి నుంచి వేరే చోటకి తరలించాలని డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి సూచించారు. కొత్తకోట గ్రామ పంచాయతీ గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ కోన లోవరాజు ఉప సర్పంచ్ పందల దేవ,ఎంపీటీసీ పూడి దేవ, వార్డు మెంబర్లతో పాటు గ్రామ ప్రజలు పాల్గొని పారిశుధ్యం, ఆక్రమణల తొలగింపు సహా పలు సమస్యలను గ్రామసభలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ దేవ మాట్లాడుతూ బి.ఎన్ ఆర్ అండ్ బి రోడ్డును ఆనుకొని ఉన్న సాయిబాబా, వీరబ్రహ్మేంద్ర స్వామి, రాంభాయమ్మ ఆలయాల చెంతన, వాటికి వెళ్లే దారి మధ్యలో మాంసం దుకాణాలు ఏర్పాటు కారణం గా భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాంసం దుకాణాలను అక్కడి నుంచి తొలగించి మరో చోటుకు తరలించాలని కోరారు. మండల పరిషత్ కు చెందిన సుమారు 2 ఎకరాల స్థలం చాలా వరకు ఆక్రమణకు గురైందని, సర్వే చేయించి ఆక్రమించిన స్థలాలను స్వాధీన పర్చుకోవాలని పేర్కొన్నారు.మండల పరిషత్ కు చెందిన వాణిజ్య సముదాయ దుకాణాల అద్దెలు చెల్లించట్లేదని,. ఏళ్ల తరబడి కొందరి చేతుల్లోనే దుకాణాలు ఉన్నాయని, తక్షణమే వేలం నిర్వహించి నామమాత్రపు అద్దె ను రద్దు చేసి దుకాణాల అద్దె ను కనీసం రూ.1500కు పెంచాలని దీనితో పంచాయతీ కి ఆదాయం పెంపు జరుగుతోందని ఎం పి టిసి దేవ అధికారులను డిమాండ్ చేసారు. పారిశుధ్య పనులు సక్రమంగా జరగట్లేదని, వీధులన్నీ చెత్త కుప్పలు గా దర్శనం ఇస్తున్నాయని పలువురు గ్రామస్తులు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఈవో జ్యోతిశ్వరరెడ్డి, టిడిపి నాయకులు కోట సత్తిబాబు పాల్గొన్నారు.



రావికమతంలో నిర్వహిస్తున్న గ్రామసభ



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : పట్టణంలో శ్రీ వాసవి కళ్యాణ మండపం వాసవి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రెసిడెంట్ జాలుమూరి, వి.ఎ.ఎన్. జోగారావు, సెక్రటరీగా పీ కన్నయ్య శెట్టి, కోశాధికారిగా ఊడా సూర్యారావు, వైస్ ప్రెసిడెంట్‌గా తాటికొండ సీతారాం, వైస్ ప్రెసిడెంట్ సుతాపల్లి చైతన్య, జాయింట్ సెక్రటరీగా బొండాడ వెంకట రామ శేషు, తాటికొండ హేమంత్, కమిటీ నెంబర్లుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జాలుమూరి బంగార్రాజు, వెలగా నారాయణరావు, ఊడ వెంకట్రావు, సూతపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిసున్న డిఎస్‌పి, సిఐ

నేటి నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ మండలం ఏఎల్.పురం హైస్కూల్లో ఈనెల4న శనివారం నుండి రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు శుక్రవారం నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు, నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ, నాతవరం ఎస్సై వై.తారకేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు చిటికెల తారకవే ణుగోపాల్ హైస్కూల్ ఆట స్థలాన్ని పారిశీలిం చారు. భద్రత ఏర్పాట్లు, ఆటగాళ్ళకు సమకూరుస్తున్న వసతలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెూమ్ మంత్రి అనిత, శాసనసభ స్పీకర్ రానున్నారు.

నేడు జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో జరగనుందని ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సర్వసభ్య ఉదయం 10.30 గంటల నుంచి సమావేశ మందిరం వేదికగా కొనసాగుతుందని సభ్యులు,అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు,ఎంపిపిలు, అధికారులు సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

కూలిన చెట్లు తొలగింపు

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ: విశాఖలో గురువారం వర్షాలు కారణంగా వీచిన ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన జివిఎంసి యంత్రాంగం తొలగించి ప్రజలకు , వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. ఈదురు గాలులకు 168 చెట్లు నేలకొరిగాయని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. పాక్షికంగా పూర్తిగా నేలకొరిగిన చెట్లను తొలగించి తరలించేందుకు 8 ప్రత్యేక బృందాలను, 17 జేసిబిల సహాయంతో యుద్ధ ప్రాతిపదికన చెట్లు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. 145 చెట్లను పూర్తిస్థాయిలో తొలగించి నగర ప్రజలకు , వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తరలించామని తెలిపారు. మిగిలిన 23 చెట్లను తొలగించే పనులు జరుగుతున్నాయన్నారు. 9 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని వాటిని పునరుద్ధరించే కార్యక్రమం చేపట్టి విద్యుత్తుకు అంతరాయం కలుగకుండా తగు చర్యలు చేపట్టామన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

-హోం మంత్రి అనిత

-నూతన ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -నక్కపల్లి: రాబోయే తరాలను ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలో వేంపాడు టోల్ ప్లాజా సమీపంలో భారతి కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం హెూం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన 147 మంది ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఎంపికైన ఉపాధ్యాయులకు నూతన వస్త్రాలు, సన్మాన పతకాలు, మొక్కను అందజేసి ఘనంగా సత్కరించారు. పాయకరావుపేట మండలం, పిఎల్ పురం గ్రామానికి చెందిన ధనలక్ష్మికి అపాయింట్మెంట్ ఆర్డర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, పిల్లల విద్య కోసం తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేస్తారన్నారు. ఈ మెగా డీఎస్సీ ప్రక్రియలో 140 కోర్టు కేసులు ఎదురైనా, ప్రభుత్వం పట్టుదలగా ముందుకు సాగిందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఇప్పటివరకు 9 డీఎస్సీలు నిర్వహించారని, తాను కూడా 2002లో టీచర్‌గా చేరారని తెలిపారు. మంత్రి లోకేష్ విద్యావ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకువచ్చారని, పాఠశాలలు దేవాలయాలంటూ భావించి, అక్కడ ఎలాంటి సమావేశాలు, వేడుకలు నిర్వహించకూడదని స్పష్టంగా పేర్కొన్నారన్నారు. ఉపాధ్యాయులతో కలిసి హెూం మంత్రి అనిత భోజనం చేశారు.



డిఎస్‌సిలో ఎంపికైన ఉపాధ్యాయులతో అనిత

వాహన, ఆయుధ పూజలో అనిత

నక్కపల్లి: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించు కుని హెూం మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం వాహన, ఆయుధ పూజ నిర్వహించారు. పురోహితులు శాస్త్రోక్తంగా వాహనాలకు, ఆయుధాలకు పూజా కార్యక్రమాన్ని చేపట్టారు.

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడమే వైసిపి అజెండా

-టిడిపి రాష్ట్ర అధ్యక్షులు

పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడమే వైసిపీ ప్రధాన అజెండా అని, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గాజువాక టిడిపి కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి ఓర్వలేకపోవడంతోపాటు తమ మనుగడ ప్రశ్నార్థకమౌతుందన్న ఆందోళనలో వైసిపి కుతంత్రాలు చేస్తోందన్నారు. దీన్ని గమనించిన ప్రజలు, వైసిపి కుట్రలను, నమ్మకద్రోహాన్ని ముందే గమనించి తగిన గుణపాఠం చెప్పారన్నారు. విశాఖను ఐటి హబ్‌గా మార్చాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తుంటే, గూగుల్ సంస్థకు కేటాయించిన



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

భూములపై బినామీ పేర్లతో కేసులు వేయించి ఐటీ ప్రాజెక్టుల్ని అడ్డుకోవాలని వైసిపి కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఈనెల 4న ఉదయం 10.30 గంటలకు ఆటోడ్రైవర్ సేవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కూటమి ప్రభుత్వం, రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్ల ఖాతాల్లో రూ15 వేలను అందజేస్తోందని, తద్వారా రెండు లక్షల పైచిలుకమందికి లబ్ధి చేకూరుస్తోందన్నారు ఒక్క విశాఖ జిల్లాలోనే ఈ పథకం ద్వారా 17వేల మందికి, గాజువాక నియోజవర్గంలో మూడువేల మంది ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తూ, సూపర్ సిక్స్ పథకాల అమలుతో సూపర్ పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసిపి నేతల్లో గుబులుపట్టుకుందన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాసరావు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ హాజీ మొకరం హుస్సేన్, టిడిపి 66వ వార్డు అధ్యక్షులు గోమాడ వాసు. 79వ వార్డు జనసేన అధ్యక్షులు మేడిశెట్టి విజయ్, టిడిపి నాయకులు సింగంపల్లి దేవుడు పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం సేకరణపై ముందస్తు ప్రణాళిక

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ లక్ష్యంగా పటిష్టమైన ప్రణాళికలతో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం రానున్న ఖరీఫ్ సీజన్ 2025-26లో ధాన్యం సేకరణపై జిల్లా స్థాయి ధాన్యం సేకరణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ధాన్యాన్ని, తేమ శాతాన్ని అనుసరించి క్వింటాకు సాధారణ రకానికి రూ.2,369, గ్రేడ్ ఏ రకానికి రూ.2389 చొప్పున కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ముందే గ్రామ స్థాయిలో ఈ-పంట, ఈ-కెవైసి నమోదు శతశాతం పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బంది లేకుండా కస్టోడియన్ అధికారులను నియమించాలన్నారు. రైతులకు అనువైన విధంగా ధాన్యం సేకరణ కేంద్రాలను రైస్ మిల్లులతో సమన్వయం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాట్లను తహసీల్దార్ తనిఖీ చేయాలన్నారు.సమావేశంలో జెసి ఎం.జాహ్నవి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ పి.జయంతి, జిల్లా పౌర సరఫరాల అధికారి కెవిఎల్ఎన్.మూర్తి, వీడియో కన్ఫరన్స్ ద్వారా అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ అయిషా, వివి రమణ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మోహన్‌రావు, ఎఫ్‌సిఐ మేనేజర్ నరేష్ కుమార్, డిటిఓ మనోహర్, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

పిహెచ్‌సి వైద్యుల డిమాండ్లను నెరవేర్చాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యుల న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి వద్ద డాక్టర్ల ఆందోళన శిబిరాన్ని శుక్రవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్‌తో కలిసి శంకరరావు సందర్శించారు. వారి నిరసనలో పాల్గొని మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించాల్సిన డాక్టర్లను రోడ్లపైకి ఈడ్చడం ప్రభుత్వానికి ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనేక సంవత్సరాలుగా డాక్టర్ల వృత్తిలో సేవలు అందిస్తున్న వారికి రావాల్సిన ప్రమోషన్లు ఇవ్వకపోవడం, జీవో నెంబర్ 99 పేరుతో డాక్టర్ల హక్కులపై దాడి చేయడం అన్యాయమన్నారు. సర్వీస్‌లో ఉన్న డాక్టర్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలని హితవుపలికారు. ప్రజారోగ్య రంగాన్ని ప్రభుత్వ ఆధీనంలో మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు ఉన్న వైద్య సదుపాయాలను కూడా ప్రైవేట్ శక్తులకు అప్పచెప్పాలని చూస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రంలో 10 మెడికల్ కళాశాలను పిపిపి పేరుతో ప్రైవేటుకు అప్పగించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పిహెచ్సి వైద్యుల అసోసియేషన్‌తో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) జేఏసీ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

మెడికల్ యూనియన్ల మద్దతు....

అనకాపల్లి : పిహెచ్సి డాక్టర్స్ అసోసియేషన్ చేపట్టిన సమ్మెకు సిఐటియు అనుబంధ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ విలేజ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్లు మద్దతు తెలుపుతున్నట్లు ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.జగన్ మోహన్‌రావు, తాళ్లూరి వెంకటేశ్వర్లు, మాధవి, సంధ్యారాణి తెలిపారు. అసోసియేషన్‌తో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు.